


# సత్యవాక్కు

సంపుటి - 43 జూన్- 2022 సంచిక - 11

## క్రైస్తవ మాసపత్రిక

జూన్ - 2022

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

## సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో |
| మంగళవారం మధ్యాహ్నం | : | 3.00 ని॥లకు నిరీక్షణ ఛానల్‌లో |
| బుధవారంఉదయం | : | 7.30 ని॥లకు నిరీక్షణ ఛానల్‌లో |
| శనివారం ఉదయం | : | 6.30 ని॥లకు ఆరాధన ఛానల్‌లో |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోసీ గూటం |

Youtube లో satyavanicoc.kkd లో

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

జూన్ విషయ సూచిక


1. దేవుని సువర్తమానములోని శక్తి-1 - పేజీ 3
2. నేడు మనము సబ్బాతును ఆచరింపవలెనా? 9
3. రెండు ప్రాముఖ్యమైన ప్రశ్నలు 12
4. సాతానును గూర్చి పొలుచేసిన బోధ 14
5. లేఖనములను గూర్చి పాటించదగు కొన్ని సలహాలు 17
6. మరణము - నిత్యత్వము 18
7. దేవుడు ఆలకించని సమయము 22
8. నాలుకను అదుపులో యుంచుకొనుము 23



SATYA VANI

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్ : జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 43 | జూన్ - 2022 | సంచిక 11

## దేవుని సువర్తమానములోని శక్తి -1

సంశయములతోను సందిగ్ధములతోను నిండియున్న ఈ రోజులలో మీకొక ఖచ్చితమైన వర్తమానము నందించగోరుచున్నాను. మీరు భయపడు సమయమందు విశ్వాస పాఠమును మీకు బోధించ గోరుచున్నాను. నిరాశ, నిస్పృహ జెంది యున్న ఈ యుగములో నిరీక్షణ వర్తమానమును మీకు అందించ గోరుచున్నాను. ఈ రోజు దేవుని సువర్తమానమును మీకు అందించ గోరుచున్నాను. ఆయన వర్తమానము శక్తివంతమైనది.

"సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను; ఏలయనగా నమ్ము ప్రతివానికి...రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నదని" అపో. పౌలు చెప్పెను (రోమా 1:16). దేవుని సువార్తలో అతి ప్రాముఖ్యమైన మూడు సంగతులున్నవి. వాటిని మీరు ఈ వచనమునుండి గమనించగోర్తాను. మొదటిగా, దేవుని వర్తమానము శక్తితో నిండుకొని యున్నది, అది దేవుని శక్తి, రెండవదిగా దేవుని సువార్త పురుషులను స్త్రీలను తమ పాపములనుండి రక్షించు నిమిత్తము ఉద్దేశించబడినది;

మూడవదిగా దేవుని నుండి కలిగిన ఈ వర్తమానము వలన రక్షింపబడ వలెనంటే, దీవించబడవలెనంటే మానవుడు దానిని నమ్మవలెను.

సువార్తలో యున్న దేవుని శక్తిని గూర్చి మనము ఇప్పుడు కొంత ఆలోచింతము. సువార్త శక్తిగల వార్తయై యున్నది ఏలయనగా దానికి కర్తయైన దేవుడు, శక్తిగల దేవుడు. సృష్టింపబడిన ఈ విశ్వమంతటిలో దేవునిశక్తి బయల్ప రచబడి యున్నది. మొదటి శతాబ్దములో ప్రబలియున్న అజ్ఞాతవాదుల యొక్కయు, నిర్దేవుల యొక్కయు అవిశ్వాసులు యొక్కయు సమస్యలను గూర్చి వివరించుచు అపొ.పౌలు ఇట్లు చెప్పెను:

ఆయన అదృశ్య లక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వ మును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచిం చుట వలన తేటపడుచున్నవి గనుక వారు నిరుత్తరులై యున్నారు" (రోమా 1:20). దేవుని యొక్క లక్షణములు సృష్టింపబడిన వస్తువులను ఆలో... టవలన తేటపడుచున్నవి.

అంతములేని ఆకాశము... కోట్లకొలది నక్షత్రములు మనకు కనబడుచున్నవి. నిజానికి అవన్నియు మనము ఊహించలేనంత పెద్ద గ్రహములు. వాటిని కలుగజేసిన దెవరు? లేక ఏశక్తియు లేకుండగనే వాటికవే కలిగెనా? సూర్యచంద్రులను భూమిని, సూర్యుని చుట్టూయున్న గ్రహములను చేసినదెవరు? మనకు క్రమము తప్పకుండా కలుగు ఋతువు లకు కారణభూతుడంటూ యెవరైనా ఉన్నారా? ఈ విశ్వమంతయు గణిత శాస్త్రము ననుసరించి ఒక్క పొరబాటు కూడా లేకుండా యెట్లు చలించు చున్నది? నిజానికి మనుష్యుని గూర్చియే ఆలోచింతము. అతని జీర్ణ కోశమంతయు ఒక గొప్ప కెమిస్ట్రీ పరిశోధనశాలయే. అతని మెదడు ఊహించలేనంత సున్నితమైన ఒక గొప్ప కంప్యూటరే. మనుష్యుని కంటి యొక్క శక్తి, అతి సున్నితమైనది. ఇట్టి

సున్నితమైన అవయవములు లేక పరికరములు వాటికవే కలిగెనని నీవు నమ్మగలవా? వాటిలో మన కగుపడు నమూనా వాటిని చేసిన వానిని, లేక వాటికి కర్తయైన వానిని సూచించుట లేదా? అందుకే జదుత్పత్తి మొదలు కొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన దేవుని లక్షణ ములు తేటపడుచున్నవని బైబిలు బోధించుచున్నది.

హెబ్రీయులకు వ్రాయబడిన పత్రికలో ఒక చక్కని మాటయున్నది: "ప్రతి యిల్లును ఎవడైన ఒకని చేత కట్టబడును" (హెబ్రీ 3:3). ప్రతి యింటిని కట్టిన వాడొకడున్నాడని నీవు నమ్ముదువా? నీవున్న యింటిసంగతి యేమిటి? అది దానికదే నిర్మింప బడెనా? బహుశా నీవు నీ సొంత యింటిలో యున్నావేమో లేదా ఒక అద్దె యింటిలో యున్నావేమో! ఏది ఎట్లయినను యిల్లంటూ ఒకటి యున్నప్పుడు దానిని నిర్మించిన వానిని అది సూచించుటలేదా? అయితే ఒకసారి భూమ్యాకాశములవైపు తేరి చూడుము. ఇశ్రాయేలీయుల మధుర గాయకుడు ఇట్లనుచున్నాడు: "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచు చున్నది. పగటికి పగలు బోధ చేయు చున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపు చున్నది. వాటికి భాషలేదు, మాటలు లేవు, వాటి స్వరము వినబడదు" (కీర్తన 19:1-3). ఆకాశములు ప్రచురపరచు వర్తమానమేమిటి? వాటి యొక్క ఉనికి ని బట్టియు, అవి చలించు ఖచ్చిత క్రమమును బట్టియు మమ్మును చేసిన వాడు దేవుడేయని అవి చాటించు చున్నవి.

**సర్వశక్తిగల దేవుడు భూమ్యా కాశములనెట్లు కలుగజేయగలిగెను?** హెబ్రీ 11:3లో ఇట్లు చెప్పబడినది. "ప్రపంచములు దేవుని వాక్యమువలన నిర్మాణమైనవనియు అందునుబట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడలేదనియు విశ్వాసముచేత

గ్రహించుకొనుచున్నాము''. ప్రపంచములు దేవుని వాక్యమువలన నిర్మింపబడెను గనుక సర్వశక్తిగల దేవుని వాక్యములో సృష్టించే శక్తియుండెను. ఆయనకున్న ఆశ్చర్య శక్తివలన ఈ లోకములను దేవుడు సృజించుటయే కాకుండా, ఆయన కుమారుడైన యేసుక్రీస్తును మృతులలో నుండి లేపే శక్తిని ఆయన కలిగి యుండెను. అంతేకాకుండా, ఈ సర్వశక్తిగల దేవుడు ఆత్మీయముగా మృతులైన వారిని అనగా పాపము వలన ఆయన నుండి వేరైపోయిన వారిని ఆత్మీయముగా జీవింపజేసే శక్తిని కలిగి యున్నారు.

ఎఫెసీయులకు వ్రాయుచు, పౌలు "మీ అపరాధముల చేతను, పాపముల చేతను మీరు చచ్చిన వారై యుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రతికించెను'' అని తెలియజేసెను (ఎఫెసీ 2:1). ఇంకొక మాటలో దేవుడు తన శక్తిచేత తన కుమారుని భౌతిక మరణము నుండి జీవింపజేయ గలిగిన యెడల, ఆత్మీయముగా మరణించిన వారిని ఆయన తప్పక జీవింపజేయగలడు.

రోమీయులకు వ్రాసిన పత్రిక మొదటి అధ్యాయములో సువార్తలో యున్న దేవుని శక్తిని గూర్చి పౌలు ప్రకటించెను. సువార్త యనగా ఉత్తమమైన వాటిని గూర్చిన శుభవార్తయని రోమా 10:15లో అతడు చెప్పెను. శక్తిగల దేవుడు దానికి కర్త గనుక సువార్త శక్తియై యున్నది. నాశనము చేయు పాపపు శక్తి నుండి మానవులను విడుదల చేయు శక్తిగల సాధనము సువార్త. పౌలు రోమా 1:16లో చెప్పిన మాటలలోని రెండవ అంశము ఏమిటి? రక్షించు నిమిత్తము సువార్త దేవుని శక్తి అయ్యున్నది.

**'రక్షణ' అనునది లేఖనముల లోని అతి ప్రాముఖ్యఅంశము.** నిజానికి మనుష్యుని రక్షించు నిమిత్తమే దేవుడు తన్ను తాను బయలుపరచు కొనెను. మానవుల వినోదము కొరకు దేవుడు సువార్తను బయలుపరచలేదు.

మానవులు తమ్మును తాము అనేక రీతులుగ వినోదపరచు కొందురు, గాని దేవుని సువార్త అయితే మానవులను రక్షించు నిమిత్తము ఉద్దేశింపబడినది.

కొంతమందికి రక్షణ అంటే యేమిటో తెలియదు. అట్టివారు సహజముగా పాపమనేది ఏది లేదని తలంచుదురు. పాపము యొక్క యధార్థతను గమనించి దాని విషయమై ఒప్పింపజేయబడుట రక్షణకు లేక మార్పుజెందుటకు దోహదము చేయును. దేవుని కుమారుడు ఎందు నిమిత్తము ఈ పాపపులోకమునకు వచ్చెను? ఆయన వాక్యమై యుండెను గాని శరీరధారియై వచ్చెను. ఎందువలన? (యోహాను 1:14).

క్రీస్తు పుట్టక మునుపు కన్యయైన మరియకు పుట్టబోవు శిశువునకు యేసు అను పేరు పెట్టబడునని దేవుని దూత యోసేపుకు తెలియజేసెను. ఎందువలన? యేసు అను పదమునకు రక్షకుడు, విమోచకుడు అని అర్థము. "ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టబడునని" లేఖనములలో వ్రాయబడి యున్నది (మత్తయి 1:21). యేసుప్రభువు ఈ లోకములో కొన్ని సంవత్సరములు గడిపిన తరువాత యెరికోపట్టణములో, "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను" అని చెప్పెను (లూకా 19:10). నిత్యము దేవునితో యుండి, తనకు తానే దేవుడై యుండి ఆయన ఒక దాసుని స్వరూపము దాల్చి మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా ఎందువలన విధేయత చూపవలసి వచ్చెను? (ఫిలిప్పీ 2:5 -8).

**క్రీస్తు సిలువతో రక్షణను బైబిలు కలుపుచున్నది.** ఎఫెసీ 1:7, కొలస్స 1:14 వంటి వచనములవలన పాప క్షమాపణ క్రీస్తు రక్తముద్వారా కలుగునని దేవుని మంచివాక్యము మనకు తెలియజేయుచున్నది. మనము పాప

క్షమాపణను గూర్చి ఆలోచించుచున్న ప్పుడు, రక్షణను గూర్చి ఆలోచించు చున్నా మనుసంగతి మరచిపోరాదు. ఏలయనగా సువార్త యిచ్చు రక్షణ పాపముల నుండి కలుగు రక్షణయే. రక్షణ యను పదమునకు పాపము యొక్క శక్తి నుండి, దాని ప్రతిఫలముల నుండి పొందు విడుదల యని అర్థము. దేవుని కుమారుడైన క్రీస్తు పాపముల నుండి మానవులను రక్షించ గలరు. మానవులను పాపపు దాసత్వము నుండి విడుదల చేయగలరు. పాపము మానవుని ఒక బానిసగా చేయును, గాని యేసుక్రీస్తు పాపపు దాసత్వము నుండి మానవులను విడిపించ గలరు. ఆయన యిచ్చు విడుదలయే విమోచనమని చెప్పబడెను. ఈ విమోచన క్రీస్తు సిలువపై పొందిన మరణము ద్వారా సాధ్యమైనది (1 పేతురు 1:18,19). రక్షింపబడుట యనగా విమోచింపబడుటయే.

**పాపపు అపవిత్రత నుండి యేసు క్రీస్తు ప్రభువు మానవులను విడుదల చేయగలరు.** పాపము ఒకని అంతరాత్మను అపరాధభారముచే కలుషితము చేయును. అయితే క్రీస్తు రక్తము ద్వారా కలుగు క్షమాపణవలన ఈ అపరాధ భారము తొలగించ బడును. పాపక్షమాపణవలన మానవుని అపరాధములు మన్నించ బడును. అంటే అతడు పాపము నుండి రక్షించబడును.

నీవు పాపము నుండి విడుదల పొందవలెనంటే యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుము. నీ పాప ములవిషయమై మారుమనస్సు పొందుము; యేసుక్రీస్తు దేవుని కుమారుడని మనుష్యుల యెదుట ఒప్పుకొనుము, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అప్పుడు మన ప్రభువైన యేసు నీ సమస్త పాపములను తుడిచివేసి నిన్ను రక్షించును; పరిశుద్ధాత్మ అను వరమును నీ కనుగ్రహించును.

ఈ అంశమును తరువాత మా సంచికలో మరికొంత ధ్యానించెదము. అంతవరకు మీకు మా వందనములు.

# నేడు మనము సబ్బాతును ఆచరించవలెనా?

బైబిలులో 66 పుస్తకములున్నవి 40మంది వివిధ లేఖకులచే ఇంచు మించు 1600 సంవత్సరముల కాలములో అవి వ్రాయబడెను. పాత నిబంధనలో 39 పుస్తకములు కొత్త నిబంధనలో 27 పుస్తకములున్నవి. పాతనిబంధనలో దేవుడిచ్చిన రెండు రకములైన చట్టములున్నవి. వాటిలో మొదటిది పితరుల కిచ్చిన చట్టము (మతము), రెండవది యూదులకిచ్చిన చట్టము (మతము). దేవుడిచ్చిన మూడవ చట్టము క్రొత్తనిబంధన. అది సర్వమానవాళికి వర్తించును.

గనుకనే అపొస్తులుడైన పౌలు పరిశుద్ధాత్మప్రేరణవలన "దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడ నక్కరలేని పనివానిగాను, సత్యవాక్య మును సరిగా ఉపదేశించువాని గాను నిన్ను నీవే దేవునికి కనబడుటకు జాగ్రత్తపడుము" అని హెచ్చరించాడు (2 తిమోతి 2:15). దేవుని వాక్యాన్ని పఠించు విద్యార్థి పాత క్రొత్తనిబంధనల వ్యత్యాసాన్ని గ్రహించుకోవాలి. పితరుల యుగానికి, యూదుల యుగానికి, క్రైస్తవ్యానికి గల తేడాను తెలిసికోవాలి. అదే కుటుంబ మతము, జాతీయ మతము, అంతరాజ్జతీయ మతము అను వాటిని గ్రహించు కోవాలి.

పాతనిబంధన క్రొత్తనిబంధనకు పునాదిగాను, మందియ్యబడిన దాని గాను యున్నను దాని స్థానముననే క్రొత్తనిబంధన ఇయ్యబడెనని లేఖన ములు చెప్పుచున్నవి. యేసు ప్రభువు ధర్మశాస్త్రమును (పాతనిబంధ నను) నాశనము చేయలేదు గాని, దానిని నెరవేర్చారు (మత్తయి 5:17). పాత చట్టమునకు బదులు క్రొత్త చట్టము నీయవలెనని ఎల్లప్పుడు దేవుని కాంక్షయైయుండెను. పాత నిబంధన తీసివేయబడి దాని స్థానముననే క్రొత్త నిబంధన ఇయ్యబడుననే పాత నిబంధన ప్రవచనమును గమనించుము.

"ఇదిగో నేను ఇశ్రాయేలువారి

చేయు దినములు వచ్చుచున్నవి. ఇదే యెహోవావాక్కు. అది ఐగుప్తులో నుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యి పట్టుకొనిన దినమున వారి పితరులతో చేసిన నిబంధన వంటిదికాదు; నేను వారి పెనిమిటినైనను వారు ఆ నిబంధనను భంగముచేసికొనిరి, యిదే యెహోవా వాక్కు. ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలువారితోను యూదా వారితోను చేయబోవు నిబంధనయిదే, వారి మనస్సులలో నాధర్మ విధి ఉంచెదను, వారి హృదయ ములమీద దాని వ్రాసెదను. యెహోవా వాక్కు యిదే. నేను వారికి దేవుడనై యుందును. వారు నాకు జనులగుదురు; వారు మరి ఎన్నడును యెహోవాను గూర్చి బోధనొందుదము అని తమ పొరుగు వారికి గాని తమ సహోదరు లకు గాని ఉపదేశము చేయరు; నేను వారి దోషములను క్షమించి వారి పాపములను ఇకనెన్నడు జ్ఞాపకము చేసి కొనను గనుక అల్పులేమి, ఘనులేమి అందరు నన్నెరుగుదురు. ఇదే యెహోవా వాక్కు" (యిర్మియా 31:31-34).

"ఏలయనగా ఆ మొదటి నిబంధన లోపము లేనిదైతే రెండవ దానికి అవకాశముండనేరదు. అయితే ఆయన ఆక్షేపించి వారితో ఈలాగు చెప్పుచున్నాడు : ప్రభువు ఇట్లనెను. ఇదిగో యొక కాలము వచ్చుచున్నది. అప్పటిలో ఇశ్రాయేలు ఇంటివారితోను యూదా ఇంటి వారితోను నేను క్రొత్త నిబంధనచేయుదును. అది నేను ఐగుప్తు దేశములోనుండి వీరి పితరులను వెలుపలికి రప్పించుటకై వారిని చెయ్యిపట్టుకొనిన దినమున వారితో నేను చేసిన నిబంధన వంటిదికాదు. ఏమనగా వారు నా నిబంధనలో నిలువలేదు గనుక నేను వారిని అలక్ష్యము చేసితినని ప్రభువు చెప్పుచున్నారు. ఆ దినములైన తరువాత ఇశ్రాయేలు ఇంటివారితో నేను చేయబోవు నిబంధనయేదనగా, వారి మనస్సులో నాధర్మవిధి ఉంచె దను, వారి హృదయముల మీద వాటిని వ్రాయుదును, నేను వారికి దేవుడనై యుందును, వారు నాకు ప్రజలై యుందురు. వారిలో ఎవడును

ప్రభువును తెలిసికొనుడని తన పట్టణస్థునికైనను, తన సహోదరుని కైనను ఉపదేశము చేయడు. వారిలో చిన్నలు మొదలుకొని పెద్దల వరకు అందరు నన్ను తెలిసికొందురు. నేను వారి దోషముల విషయమై దయగలిగి వారి పాపములను ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసికొనననని ప్రభువు సెలవిచ్చు చున్నాడు.

"ఆయన క్రొత్తనిబంధన అని చెప్పుటచేత మొదటిది పాతదిగా చేసి యున్నాడు. ఏది పాతగిలిఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది" (హెబ్రీ 8:7-13).

తత్ఫలితముగా పాత ధర్మశాస్త్ర మగు పాతనిబంధన స్థానములో క్రొత్త నిబంధన ఈయబడెను. పాతనిబంధన ఎత్తివేయబడెను (ఎఫెసీ 2:15). అది మేకులతో సిలువకుకొట్టబడి, దానిమీద చేవ్రాతను తుడిచివేయబడి, మనకు అడ్డము లేకుండా ఎత్తివేయబడెను (కొలస్స 2:14). యేసుక్రీస్తు సిలువ వేయబడినప్పటి నుండి మానవజాతి "ధర్మశాస్త్రము నుండి విడుదల పొందెను" (రోమా 7:6). మానవజాతి ఇప్పుడు పాతనిబంధనవైపు, చివరకు పదియాజ్ఞల వైపు చూడనక్కరలేదు. ఒక చట్టమువలె అది ఏలుబడిలో లేదు. అది మనకు బోధకలుగు నిమిత్తము ఒక చరిత్రాత్మక చట్టము వలెయున్నది (రోమా 15:4).

అయితే పాతనిబంధనలోని పదియాజ్ఞలలో తొమ్మిది, అనగా సబ్బాతును గూర్చిన ఆజ్ఞ తప్ప, తొమ్మిది ఆజ్ఞలు ప్రత్యక్షముగా గాని, పరోక్షముగా గాని క్రొత్తనిబంధనలో ఇమడ్చబడియున్నవి. "విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము" (నిర్గమ 20:8) అను ఆజ్ఞ యొక్క స్థానములో ఆదివారమున ఆరాధించుటకు కూడు కొనవలెనని క్రొత్తనిబంధన మనకు నిర్దేశించుచున్నది (అపొ.కా. 20:7; 1 కొరింధీ 16:1,2). అది యేసుక్రీస్తు మృతులలో నుండి తిరిగి లేచిన దినము మరియు క్రీస్తు సంఘము ఆవిర్భవించిన దినము. గనుక క్రైస్తవులు శనివారమున గాక,

క్రైస్తవులు శనివారమున గాక, వారములో మొదటి దినమున అనగా ఆదివారమున దేవుని ఆరాధించుటకు కూడుకొందురు.

సబ్బాతునాచరించుటలో ఆరాధనకంటే ఇంకా ఎంతో ఎక్కువ ఇమిడి యుండెను. ఉదాహరణకు ఆ దినమున ఏ పని చేయకూడదు, ప్రయాణం వగయిరా చేయకూడదు, మరియు జంతుబలుల నర్పింపవలెను. క్రైస్తవుడయిన వాడెవడును నేడు సబ్బాతును ఆచరింపడు, ఆచరింప లేడు, పాతనిబంధలోని ఏ భాగము నైనను ఆచరింపగోరువాడు "క్రీస్తు నుండి వేరుచేయబడినవాడు మరియు కృపలో నుండి తొలగిపోయిన వాడు (కొలస్స 3:4).

## రెండు ప్రాముఖ్యమైన ప్రశ్నలు

లూయిస్ రష్మోం

**1. పాత నిబంధనలో పాప క్షమాపణ యున్నదా? లేనిచో హానోకు పరలోకమున కెట్లు కొనిపోబడ్డాడు?**

బైబిలు ఇట్లు చెప్పుచున్నది : "ఏ భేదమును లేదు; అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు. కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే క్రీస్తుయేసు నందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులుగా తీర్చబడుచున్నారు. పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమివలన ఉపేక్షించినందున ఆయన తన నీతిని కనబరచవలెనని క్రీస్తుయేసు రక్తమునందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా బయలుపరచెను" (రోమా 3:23-26). గనుక పాతనిబంధన కాలములో పరిపూర్ణ పాపక్షమాపణలేదు. హెబ్రీ 9:15; 10:4 చదువుము.

హానోకు విషయానికి వచ్చు నరికి అతడు పరలోకమునకు కొనిపోబడెనని బైబిలు ఎక్కడా చెప్పుట లేదు. సరిగదా, "హానోకు దేవునితో నడచిన తరువాత దేవుడతని తీసికొని పోయెను గనుక అతడు లేకపోయెను" అని అది చెప్పుచున్నది (ఆది.కా. 5: 24). మరియు "విశ్వాసమును బట్టి

హానోకు మరణము చూడకుండునట్లు కొనిపోబడెను" అని హెబ్రీ 11:5లో చెప్పబడినది.

**2. లూకా 22:35-38లో యేసుక్రీస్తు తన శిష్యులను కత్తులు కొనుక్కొనవలెనని, రెండు కత్తులు చాలునని ఎందుకు చెప్పారు?**

నిజానికి ఆలేఖన భాగమును మనము జాగ్రత్తగా పరిశీలిస్తే రెండు కత్తులు కొనుక్కొనవలెనని తన శిష్యుల కు యేసుక్రీస్తు చెప్పలేదు. 38వ వచనములో "ప్రభువా ఇక్కడ రెండు కత్తులున్నవని శిష్యులు ఆయనతో చెప్పారు. మనకు తెలిసినంత వరకు ఆ మేడగదిలో అప్పటికే రెండు కత్తులుండియుండెను.

పరిస్థితులు మారబోవుచున్నవని యేసువారికి చెప్పుచున్నారు. మత్తయి 10 అధ్యాయములో యేసు శిష్యులకు "పరిమితిగల ఆజ్ఞలు" యిచ్చి పంపి నప్పుడు వారు తమతో డబ్బునుగాని, మిగతా వస్తువులను గాని తమతో తీసికొనక దేవుని కాపుదలపై ఆధార పడవలెనని ఆయన ఉద్దేశ్యము అయితే ఆయన పునరుత్థానుడైన తరువాత పరిస్థితులు వేరుగా యుండును. వారికి రక్షణ అవుసరము. అవుసరమైతే వారు తమ బట్టలను అమ్ముకొని కత్తికొనుక్కొ నుట అవుసరం. తన శిష్యులు కత్తులు కొనుక్కొవాలని యేసు ఆజ్ఞాపించలేదు. గాని వారు తమ పనిలో లోకజ్ఞానము వినియోగించుకోవాలని బోధించారు.

పై లేఖనభాగంతో మనకు వచ్చే సమస్యయేమంటే "యేసు నా రాజ్యము ఈలోక సంబంధమైనదికాదు: ఈ లోక సంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింప బడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు గాని నా రాజ్యము ఈలోక సంబంధమైనది కాదనెను" (యోహాను 18:36). తన రాజ్య (సంఘు) పరిరక్షణ కొరకు శిష్యులు మతసంబంధ యుద్ధము చేయుటకు యేసు అనుమతి ఇయ్యలేదు. అయితే శిష్యులు తమ్మును తాము పరిరక్షించుకొనకూడదని ఆయన ఎన్నడు చెప్పలేదు.

-డెన్నిస్ గుల్లెడ

# సాతానును గూర్చి పౌలు చేసిన బోధ

సాతానుడు గర్జించు సింహము వలె ఎవని మ్రింగుదునాయని తిరుగు చున్నట్లు క్రొత్తనిబంధన బోధించు చున్నది (1పేతురు 5:8). సాతాను యొక్క తంత్రములను ఎదుర్కొనుటకు క్రైస్తవులు దేవుని సర్వాంగ కవచమును ధరించుకొనవలెను (ఎఫెసీ 6:11-17). సాతానుడు పనిచేయు విధానమును మనం ఎంత ఎక్కువ ఎరిగి యుంటే వానిని ఎదుర్కొనుటకు మనం అంతసిద్ధపడి యుండగలము. యేసు ప్రభువు సాతానుని యొక్క శక్తిని నాశనం చేసినందున మనము వానిని గూర్చి భయపడనక్కరలేదు (హెబ్రీ 2: 14,15). అయినను మనం అతనికి చోటిస్తే వాడు మనలను ప్రభావితం చేయగలడు.

కొరింథీయులకు పౌలు వ్రాసిన రెండవపత్రికలో సాతానుడు పనిచేయు విధానమును గూర్చి ఎక్కువ తెలియ జేసియున్నాడు. కొరింథులో యున్న సంఘములో అనేక సమస్యలుండెను. ప్రతిసంఘములో వలె కొరింథులో యున్న సంఘములో కూడ సమస్య లుండెను. ఆ సమస్యలలో నుండి బయల్వెడలుటకు నడిపింపుగా పౌలు వారికి రెండు పత్రికలు వ్రాసాడు. కొరింథీయులకు పౌలు యిచ్చిన నడిపింపును బట్టి మనము కూడ సాతాను యొక్క తంత్రములను జయించుటకు సిద్ధపడగలము.

## సాతానుడు పనిచేయు విధానము మన మెరుగుదుము

కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రికలో మారుమనస్సు పొందిన వానిని చేర్చుకొనుటను గూర్చి పౌలువ్రాసాడు. అట్టివాడు పొందిన శిక్ష యికచాలునని అతడు వారికి తెలియ జేసాడు (2కొరింథీ 2:6). గనుక వారతని ఇంక శిక్షింపక ఆదరించి క్షమించుట మేలు (2 కొరింథీ 2:7). మరియు వానియెడల తమ ప్రేమను స్థిరపరచవలెను (2:8). ఏలయనగా మనము సాతాను తంత్రములను ఎరుగనివారము కాము (2 కొరింథీ

2:11). సంఘములో గొడవలు సృష్టించి అవికొనసాగాలని సాతానుడు ప్రయత్నించుచు యుండును.

కొరింథులోని క్రైస్తవులు జ్ఞానులై వారి సమస్యలలో సాతాను జోక్యము నకు తావీయుకూడదు. మనము కూడ సాతాను యొక్క తంత్రములను ఎరుగని వారముకాము. వాడు ప్రవర్తించే విధానమును గూర్చి మనకు వివరించే దేవుని గ్రంథమును మనం కలిగియున్నాము. దేవుని గూర్చియు ఆయన చెప్పిన మాటలను గూర్చియు సందేహములు కలుగుజేయుటకు వాడు ప్రయత్నించునని మన మెరుగుదుము (ఆది.కా. 3:1-6). సాతానుడు శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము అను అస్త్రములను మనపై ప్రయోగించును (1 యోహాను 2:15-17). యేసుప్రభువు 40 దినములు ఉపవాసముండగా ఆయన బలహీనతను వాడుకొనుచు సాతానుడు ఆయనను ఎట్లు శోధించాడో ప్రభువు వానిని ఎట్లు జయించారో మనమెరుగు దుము' (మత్తయి 4:1-11). సాతానుడు పనిచేయు విధానమును మనవెరిగిన తరువాత వాని జిమ్మిక్కులకు మనం బలికాకూడదు. అపవాది యొక్క కుతంత్రములను ఎరిగి వానిని త్రిప్పికొట్టు వారిగ మనముండాలి.

## సాతాను ఎల్లవేళలా సాతానులాగ కనపడదు

కొరింథులోని సహోదరులను పౌలు మీదికి రెచ్చగొట్టుటకు యత్నించు చున్న అబద్ధ బోధకులను పౌలు ఖండించాడు. అట్టివారు క్రీస్తుయొక్క అపొస్తలుల వేషము ధరించుకొనువారై యుండి దొంగ అపొస్తులులును మోస గాండ్రయిన పనివారైయున్నారు (2 కొరింథీ 11:12). వారు సాతానువలె వెలుగు దూత వేషము ధరించుకొన్న వారు (2 కొరింథీ 11:14). దేవుని ప్రేమించుచున్నామని చెప్పుకొను ప్రతి వాడు సువార్త సత్యమును బోధించు చున్నవాడు కాదని కొరింథీయులు గమనించవలెను. క్రీస్తు యొక్క

వరిచారకులమని చెప్పుకొను కొందరు నిజానికి వేరొక సువార్తను బోధించు చున్నారు (గలతీ 1:6-10). సాతానుడు కూడ బైబిలు వచనములనే ప్రయోగించి మోసగించును. మనము సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టవలెను (1థెస్స 5:21). మనము ప్రతి ఆత్మను నమ్మక ఆయా ఆత్మలు దేవుని సంబంధ మైనవోకావో పరీక్షించాలి (1 యోహాను 4:1). సాతానుడు మారువేషములో రావచ్చును గాని వాని ఫలములను మాత్రము మార్చలేడు. వాని ఫలముల వలన వానిని తెలిసికొందుమని యేసు మనకు నిర్ధారణ యిచ్చారు (మత్తయి 7:15-20). సాతానుడు ఎల్లవేళలా సాతానువలె కనబడడు గాని వాడు సాతానేయని గమనించుము.

**సాతానుడు క్రైస్తవులను బాధించును**

సాతానుడు సర్వాంతర్యామి, సర్వజ్ఞాని కాకపోయినను వాడు క్రైస్తవులను బాధించుటకు ప్రయత్నించును. పౌలు శరీరములో యున్న ముల్లు "నన్ను నలుగగొట్టుటకు సాతాను యొక్క దూతగా ఉంచబడెనని" చెప్పాడు (2 కొరింధీ 12:7). వివిధము లుగా వివిధప్రజల ద్వారా సాతానుడు ఈ పనిచేయును. అయితే దేవుడు తన ప్రజలను కాపాడును. ఆయన కృప వారికి చాలును (2 కొరింధీ 12: 9-10). సాతానుడు మనలను బాధించువేమోగాని వాడు మనకు హాని చేయలేడు (1 యోహాను 5:18). భూమిపై మనం తాత్కాలికంగా సాతానును ఎదుర్కొన వలసి వచ్చినను, వాని సమయం సంకుచితమేయని సాతాను ఎరుగును (ప్రక 12:12).

గతంలో క్రైస్తవులు వానిని ఎదుర్కొన్నారు. నేడు కూడ వానిని మనం ఎదుర్కొనగలము (ప్రక 12:11). మనం వానిని చివరిగా ఎదరించినప్పుడు దేవునితో నివసిస్తాము. సాతానుడు యుగయుగములు బాధింపబడును (ప్రక 20:10).

-హీరామ్ కెంప

# లేఖనములను గూర్చి పాటించదగు కొన్ని సలహాలు

అపో.పౌలు తిమోతికి, మనకును లేఖనములను గూర్చి యిచ్చిన సలహాలు అనుసరించదగినవి. క్రైస్తవ లోకములో నేడున్న విభజలన్నిటివలన, బైబిలు సంబంధమైన నడిపింపుమన కవుసరము. 2 తిమోతి 2:14-17లో ఇట్లు వ్రాయబడి యున్నది.

"దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా విభజించువానిగాను నిన్ను నీవే దేవునికి కనబరచుకొనుటకు జాగ్రత్త పడుము. అపవిత్రమైన వట్టిమాటలకు విముఖుడవైయుండుము. అట్టి మాటలాడువారు మరియెక్కువగా భక్తిహీనులగుదురు".

ఈ హెచ్చరికలు నేరుగా యున్నవి. సులువుగా అర్ధము చేసికొనవచ్చును. గాని అవి అనుసరించుట అంత సులభముకాదు. దేవుని వాక్యమును సరిగా గ్రహించుకొనుటకు ఎక్కువ సమయము పట్టును. గ్రహించుకొనుటకు విశ్వాసులు తరుచు సమయము వెచ్చించరు. దేవుని వాక్యాన్ని సంపూర్ణముగా గ్రహించుకొనుటకు ప్రయత్నించరు.

తదుపరి లేఖనముల సర్వాధికారాన్ని వక్కాణించుచు పౌలు ఇట్లు చెప్పాడు: "క్రీస్తుయేసు నందు సద్భక్తితో బ్రదుకనుద్దేశించు వారందరు హింసపొందుదురు. అయితే దుర్జనులును, వంచకులును, ఇతరులను మోసపరచుచు తామును మోసపోవుచు అంతకంతకు చెడిపోవుదురు. క్రీస్తుయేసు నందుంచవలసిన విశ్వాసము ద్వారా రక్షణార్ధమైన జ్ఞానము నీకు కలిగించుటకు శక్తిగల పరిశుద్ధలేఖనములను బాల్యము నుండి నీవెరుగుదువు గనుక, నీవు నేర్చుకొని రూఢియని తెలిసికొన్నవి యెవరివలన నేర్చుకొంటివో ఆ సంగతి తెలిసికొని వాటియందు నిలకడగా యుండుము. దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా

సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశిం చుటకును ఖండిచుటకును తప్పుదిద్దు టకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:12-17).

ఈ లేఖనభాగము విపులముగా యున్నది, అయినను శక్తివంతమైనది. దేవునికి లోబడి ఆయనను సంతోష పెట్టుటకు లేఖనముల యందు మనము విశ్వాసముంచాలి. లేఖనముల కంటే ప్రాముఖ్యమైనది, ఆధార పడదగినది మరియొకటి లేదు. నీవు బైబిలులోని 66 పుస్తకముల సందేశమును గ్రహించావా? మన జీవితములను విశ్వాసము ద్వారా దేవునినొద్దకు ఆయన కుమారుడైన యేసునొద్దకు అవి మనలను నడిపించే శక్తిగలవి!

**-వేయిన్ బేరియర్**

## మరణము - నిత్యత్వము

మనుష్యుడు చనిపోయిన తరువాత యేమి జరుగును? సృష్టిలో ఆరవదినమందు "దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" (ఆది.కా. 2:6). జీవాత్మ శరీరమును విడిచిపోగా మరణము సంభవించును. అప్పుడు "మన్నయినది వెనుకటి వలె మరల భూమికి చేరును, ఆత్మదాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును" (ప్రసంగి 12:7). రాహేలు మృతిబొందినప్పుడు ఆమె "ప్రాణము పోవుచుండెనని" చెప్పబడెను (ఆది.కా. 35:18). ప్రాణము లేని శరీరము మృతమని యాకోబు సింపుల్‌గా చెప్పేసాడు (యాకోబు 2:26).

### మరణానంతరము

మరణించిన తరువాత ప్రతి వాని ఆత్మ "పాతాళమునకు" కొనిపో బడును. పాతాళములో రెండు భాగము లున్నాయి. 1) రక్షింపబడిన వారికి

విశ్రాంతి నిచ్చే ప్రదేశము 2) నశించిన వారు బాధనొందే ప్రదేశము. నీతిమంతుల ఆత్మలు సౌకర్యవంతమైన ప్రదేశములో పాతాళము నందు వుందురు. యేసు బీదవాడైన లాజరు చనిపోయినపుడు అతడు "అబ్రాహాము రొమ్మునకు దూతలచే కొనిపోబడెనని" యేసుచెప్పెను (లూకా 16:22). అతడు అబ్రాహాముతో సన్నిహిత సంబంధముగల ప్రదేశమునకు కొనిపోబడెను.

## పరదైసు

మరల లూకా 23:43, యేసుతో సిలువవేయబడిన ఇద్దరు దొంగలను గూర్చి చెప్పుచున్నది. వారిలో ఒకడు మారుమనస్సు పొందగా "నేడు నీవు నాతో కూడ పరదైసులో యుందువు" అని యేసు అతనితో చెప్పెను (లూకా 23:43; అపొ.కా. 2:27, 31 కూడ చూడుము). పరదైసు అనుమాటకు 'రాజవనము" లేక తోట యని అర్థము. మరణమైన తరువాత ఆ నీతిమంతుల ఆత్మలు అహ్లాదకరమైన స్థలములో యుండునని ఈ వచనముల వలన మనకు అర్థ మగుచున్నది.

## వేదనపడు స్థలము

పాపాత్ములైన వారి ఆత్మలు పాతాళములోనే వేదనపడు స్థలము నకు కొనిపోబడును. దరిద్రుడైన లాజరు సందర్భములో, "ధనవంతుడు కూడ చనిపోయి పాతిపెట్టబడెను. అప్పుడతడు పాతాళములో బాధ పడుచు, కన్నులెత్తి దూరము నుండి అబ్రాహామును అతని రొమ్మున అనుకొనియున్న లాజరును చూచెను" (లూకా 16:22, 23). తరువాత "నేను ఈ అగ్నిజ్వాలలలో యాతనపడుచున్నా నని కేకలు వేసి చెప్పెను" (లూకా 16:24). ఆవేదనకరమైన ప్రదేశము నుండి ఆ ధనవంతుడు అబ్రాహాము దగ్గరకు వెళ్ల వీలులేకుండెను (లూకా 16:26). మరియు అప్పటికింకను భూమి మీద సజీవులై యున్న తన

అయిదుగురు సహోదరులకు ఎవ్విధ మైన వర్తమానము పంపవీలు లేకుండెను (లూకా 16:27-31).

### పునరుత్థానము

ప్రజలందరు మరణము నుండి లేపబడి క్రీస్తుయేసు చేత తీర్పునొందుదురు. "దీనికి ఆశ్చర్యపడకుడి, ఒక కాలము వచ్చుచున్నది. ఆకాలమున సమాధులలో యున్నవారందరు ఆయన శబ్ధము విని మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరని" యేసు చెప్పెను (యోహాను 5:28, 29). ఆయన నియమించిన మనుష్యుని చేత నీతిననుసరించి భూలోకమున్నకు తీర్పు తీర్చబోయెడి యొుక దినమును నిర్ణయించి యున్నాడు" (అపొ.కా. 17:31). (మత్తయి 25:31-33; ప్రకటన 20: 11-15). "ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును పొందునట్లు మనమందరము క్రీస్తు న్యాయపీఠము యెదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీ 5:10).

### అంతిమతీర్పు

యేసుక్రీస్తు తీర్పుతీర్చునప్పుడు రక్షింపబడినవారిని చూచి, "నా తండ్రి చేత ఆశీర్వదించబడిన వారలారా, రండి లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి" యని చెప్పును (మత్తయి 25:34). ఆ దినమందు రక్షింపబడిన రాజ్యపౌరులందరు నిత్యనివాసములోనికి ప్రవేశింతురు (కొలస్స 1:13; ఫిలిప్పీ 3:20; అపొ.కా. 14:21,22; 2 పేతురు 1: 10, 11; 1 కొరింథీ 15:24; ప్రకటన 21:1-4).

దుర్మార్గులతో ఆయన "శపింపబడినవారలారా నన్ను విడిచి అపవాదికి వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి" యని చెప్పును (మత్తయి 25:41). "వీరు నిత్య

శిక్షకును నీతిమంతులు నిత్యజీవము నకును పోవుదురు" (మత్తయి 25:46). ఆ భవిషత్కాలమును గూర్చి చెప్పుచు యోహాను "మరణమును, మృతుల లోకమును అగ్నిగుండములో పడవేయ బడెను. ఈ అగ్నిగుండము రెండవ మరణము. ఎవనిపేరైనను జీవగ్రంథ మందు వ్రాయబడినట్లు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడును'' అని చెప్పెను (ప్రకటన 20:14,15).

### భయపడవలదు

మనము క్రీస్తు సువార్తకు లోబడి నమ్మకముగా యుండిన యెడల మరణమును గూర్చియు, నిత్యాగ్నిని గూర్చియు భయపడనక్కరలేదు. మనము బాప్తిస్మము పొందినప్పుడు దేవుని కృపవలన యేసురక్తము మన పాపములను నిర్మూలించును. ఆయనతో నడుచుచుయుండగా ఆయన రక్తము మనలను శుద్ధిచేయుచు యుండును (అపొ.కా. 2:38; 22:16; రోమా 6:3,4; ఎఫెసీ 1:7; 2:8,9; హెబ్రీ 3:12-14; 1యోహాను 1:7). "కాబట్టి చిన్నపిల్లలారా, ఆయన ప్రత్యక్షమగునప్పుడు ఆయన రాకడ యందు మనము సిగ్గుపడక ధైర్యముగా యుండునట్లు మీరాయన యందు నిలిచియుండుడి'' (1యోహాను 2:28).

ఆయనను ప్రేమించు వారందరికీ తీర్పుదినము ఒక సంతోష దినము! యేసు ఇట్లు చెప్పారు: "మీ హృదయములను కలవరవడ నియ్యకుడి; దేవునియందు విశ్వాస ముంచు చున్నారు: నా యందును విశ్వాసముంచుడి. నా తండ్రియింట అనేక నివాసములు కలవు; లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను; నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండు లాగున మరలవచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును" (యోహాను 14:1-3).

– రోయస్ ఫ్రెడరిక్

# దేవుడు ఆలకించని సమయము

సామెతలు 28:9లో దేవుని గూర్చి మానవుని ప్రార్థనలను గూర్చి ఆసక్తికరమైన సంగతి కలదు : "ధర్మ శాస్త్రము వినబడకుండా చెవిని తొలగించు వాని ప్రార్థన హేయము". అంటే మానవుని ప్రార్థన దేవుడు ఆలకించని సమయమున్నదా? అవును అని దేవుడే దీనికి జవాబిచ్చుచున్నారు. అట్లయితే ఆయన ప్రార్థనను ఎప్పుడు వినుటకు నిరాకరిస్తారు? దేవుని ధర్మ శాస్త్రము మానవుడు వినుటకు నిరాకరించినప్పుడా? "నేను పిలువగా మీరు వినకపోతిరి, నా చేయి చాపగా ఎవడును లక్ష్యపెట్టకపోతిరి, నేను గద్దింపగా లోబడకపోతిరి కాబట్టి... మీకు కష్టమును, దుంఃఖమును ప్రాప్తించునప్పుడు నేను అపహాస్యము చేసిదను అప్పుడునన్ను గూర్చి మొఱ్ఱ పెట్టెదరు గాని నేను ప్రత్యుత్తర మీయను" (సామె 1:24-28).

"దేవుని నామమున ప్రార్థన చెయ్యండి" యని మనుష్యులు నేడు ప్రోత్సాహించుచున్నారు. ప్రార్థించి రక్షింపబడండి యని చెప్పేవారున్నారు. అట్టివారి ప్రార్థనలను దేవుడు వినరు. గాని దేవుని మాటల నాలకించుడి, హృదయపూర్వకముగా వాటికి లోబడుడి. అప్పుడు ఆయన మీ ప్రార్థనల నాలకించును.

– ఎర్నెస్ట్ అండర్‌వుడ్


**ఉచిత బైబిలు కోర్సు**

**మీ యింటిలోనే ఉండి బైబిలు సత్యములను తెలిసికొనండి. మేమిచ్చు బైబిలుకోర్సులో చేరండి. పోస్టుద్వారా ఆ పాఠములను ఉచితంగానే పొంది దానిని పూర్తిచేయగానే ఒక బైబిలు గ్రంథమును ఉచితముగా పొందండి.**

**దిగువ అడ్రసుకు నేడే వ్రాయండి**

**సత్యవాణి**

**పోస్ట్‌బాక్స్ నెం. 89,**

**కాకినాడ - 533 001.**

**ఫోన్ : 0884 - 236372**

# నాలుకను అదుపులో యుంచుకొనుము

ఉద్యోగరీత్యా కొందరు జీవన్మరణాయుధములను తమతో ఎల్లప్పుడు మోసుకొని వెళ్తారు. ఉదాహరణకు పోలీసులు మారణాయుధములను, వైద్యులు ప్రాణాన్ని రక్షించే శక్తివంతమైన ఔషధములను తమతో తీసికొని వెళ్తారు. అట్టి వారిపై యున్న బాధ్యత గొప్పది. అట్టి శక్తివంతమైన పరికరాలను బుద్ధిహీనులకు, అజాగ్రత్తపరులకు అప్పగింపకూడదు.

జీవన్మరణములు నాలుకవశమని బైబిలు బోధించుచున్నది (సామె. 18:21). నాలుక గొప్ప మేలు చేయగలదు. "సాత్వికమైన నాలుక జీవవృక్షము. సమయోచితమైన మాట యెంత మనోహరము" (సామె 15:4, 23). అయితే అది గొప్ప కీడునుకూడ చేయగలదు. "నా నాలుకతో పాపము చేయకుండునట్లు నా మార్గములను జాగ్రత్తగా చూచుకొందును. భక్తిహీనులు నా యెదుటనున్నప్పుడు నా నోటికి చిక్కము ఉంచుకొందును" అని దావీదు చెప్పెను. (కీర్తన 39:1).

**మనలో ప్రతివాడు ఈ శక్తివంతమైన ఆయుధమును మనతో కూడ మోసికొని వెళ్ళుచున్నాము. సమయోచితమైన మాటవలన బలహీనులు బలపడుదురు, తొట్రిల్లువారు సరియదుగురు. అది జీవము నియ్యగలదు! కపటమైన నాలుక జీవితాలను నాశనం చేయును. చంపుటకు నిజముగా దానికి శక్తియున్నది. మనం మాటలాడునప్పుడు అందుకే జాగ్రత్తగా మాట్లాడాలి. సరియైన పదములనుపయోగించాలి. పోలీసులు మారణాయుధము లను ధరించినప్పుడు ఎంత జాగ్రత్తగా యుంటారో క్రైస్తవులు కూడ తమ నాలుకను గూర్చి అంత జాగ్రత్తగా యుండాలి.**

అదుపులోలేని నాలుకవలన కలుగు ప్రమాదము గొప్పది. అట్టిది అగ్నివంటిది. "నాలుక కూడ చిన్న అవయవమైనను బహుగా అదిరిపడును. ఎంత కొంచెము నిప్పు ఎంత విస్తారమైన అడవిని తగులబెట్టును! నాలుక అగ్నియే. నాలుక మన అవయవములల్లో ఉంచబడిన పాపప్రపంచమైన సర్వశరీరమునకు

మాలిన్యము కలుగజేయుచు ప్రకృతి చక్రమునకు చిచ్చుపెట్టును; అది నరకము చేత చిచ్చుపెట్టబడును" (యాకోబు 3:5,6).

ఆదివారపు ఉదయమున దేవుని పేరిట స్తోత్రము చేసి, తన పొరుగు వానిని మిగతా వారము దినములన్నియు శపించుచున్న యెడల అట్టివాని ఆత్మ ప్రమాద స్థితిలో యున్నది (యాకోబు 3:9). యిది అసంగతము. గాని అనేక క్రైస్తవులకు ఈ అలవాటున్నది. క్రైస్తవులు సువార్త సత్యములను పైకెత్తుటయేగాక, ఈలోకానికి ప్రకాశమానమైన దీపముల వంటివారు, సువార్తకు ఆటంకము సంభవించకుండు నిమిత్తము మన నాలుకను అదుపులో యుంచుకొందుము గాక!

-హోల్జర్ న్యూబర్

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2021-2023

సత్యవాక్కు
పోస్టుబాక్సు - 80
కాకినాడ - 533001
ఆంధ్రప్రదేశ్

ప్రచురణ తేది : ప్రతీ నెల 9వ తేదీ
పోస్టు చేయు తేదీ : ప్రతీ నెల 15వ తేదీ

ఎడిటెడ్ & పబ్లిష్డ్ బై జాషువా గూటమ్, ప్రింటెడ్ బై హిమ్ ఎట్ సత్యవాణి పబ్లికేషన్స్, సాంబమూర్తి స్ట్రీట్, కాకినాడ - 533004